(8)

# సుడిగాలిలోని దీపం

రచన : శ్రీమతి ఆర్. వసంత

"అల్లుడూ'' అని గట్టిగా అరుస్తూ దశరథరావు కోపంగా దగ్గరకువచ్చి 'నీవు మనిషివా? రాక్షసుడివా? పరాయి ఆడదాని ఎదురుగా నీభార్యను హింసిస్తున్నావే, నీలో మానవత్వం ఆనేది కొంత అయినా లేదా?' అన్నాడు.

'నోరుముయ్యి! యిది నాయిల్లు, నా యిష్టంవచ్చినట్లు వుంటాను. వుండదలచుకుంటే ఒకమూలలో వుండండి. లేదా నీవు నీకూతురిని వెంటబెట్టుకొని వెళ్ళండి. అని తూలుతూ, 'రా డియర్' అని ఆ అమ్మాయి బుజంమీద చెయ్యివేసుకొని మేడమెట్లు ఎక్కి తనగదిలోకి వెళ్ళి తలుపు వేసుకొన్నాడు.

ఆ దృశ్యాన్ని కండ్లారాచూచి దశరథరావు మనసులోని బాధలు చెప్పలేక కృషించిపోయాడు. ఏ కూతురి సుఖాలు కోసం ఎన్ని ఆశలు పెట్టుకొన్నాడో, ఆ బంగారుతల్లి ఆశా సౌధం క్రుంగిపోయింది. ఏ కుమార్తె రాణిలాగ వైభవంగా వుండాలని ఆశపడ్డాడో అటువంటి ముద్దులకూతురి సంసారాన్ని చూచి, 'తాను ఎందుకు బ్రతికివున్నాను' అని దుఃఖ భారంతో నిలువలేక సోఫాలో వ్రేళ్ళతో పెకలించిన చెట్టు లాగ పడిపోయాడు.

'అంతా అయిపోయింది. నీవు బాగుండాలని అయిన వాళ్ళను, కానివాళ్ళను కాలదన్ని, నీయిష్టానికి మారుగా, నడిచినందుకు భగవంతుడు నాగర్వాన్ని అణిచి నాకు బుద్ధి చెప్పాడు. నాలాంటి దౌర్భాగ్యుడు యీలోకంలో ఎవరూ వుండరు అని బాధగా ఏడుస్తూవుంటే—

రాధ నాన్నకాళ్ళను కౌగలించుకొని అతని ఒడిలో తల వుంచి, 'అలా అనకండినాన్న! అమ్మతర్వాత మీరే నన్ను కంటికి రెప్పలాగ కాపాడారు. అలాంటిమీరే బాధపడితే, నాకు ఎవరు దిక్కు' అని ఏడ్వసాగింది.

అలా ఏడుస్తూ రాధాదేవి ఎంతసేపుండిందో తనకే తెలియదు. జానకి, రాఘవరావు బాధగాచూస్తూ వుండిపోయారు. రాఘవరావు లోనికివెళ్ళి ఒక గ్లాసులో నీళ్ళు తీసుకవచ్చి రాధాదేవికి అందించాడు.

రాధ కన్నీళ్లు తుడుచుకొని, బరువైన మనసు కుదుట పడాలని, దుఃఖాన్ని చల్లని నీరుత్రాగి మనసు తేలిక చేసుకొన్నది. ఒక రెండునిముషాలు జరిగినతర్వాత రాధాదేవి, దుఃఖంగొంతును మూసేధానికి ప్రయత్నిస్తేను, బలవంతాన బాధను అణచుకొంటూ చెప్పడం ప్రారంభించింది.

'బాబాయిగారు! మానవజీవితం చాల విచిత్రమైనది. మనలాంటి మనసు ఎదుటివార్లకు వుంటుందని భావించడం అవివేకం. పిచ్చివాళ్లకూడ. నాభర్త ఏనాడైనా నామనసు తెలిసి, నన్ను చేరదీస్తారని, నామనసుఎరిగి కాపురం చేస్తారని, ఆరోజు త్వరలో వస్తుందని ఎంతగానో వేచి వుండాను.

కాని....కాని....వారిమనసు మారలేదు సరికదా, ప్రతి రోజు బాగుగా త్రాగి, దినమొకస్త్రీలతో నాకండ్ల ఎదుట, నాయింటిలో భరసాలు సాగిస్తూవుంటే, నామనసు ఎలాగ బాధపడివుంటుందో మీరే ఆలోచించండి. యిటువంటి భర్తతో తాళికట్టిన భార్య ఏవిధంగా సుఖపడుతుంది?' అని ఆవేశంతో అన్నది.

రాఘవరావు, జానకి, బాధతో రాధాదేవి వేసినప్రశ్నకు జవాబు చెప్పలేకపోయారు.

సోఫాలో కూర్చున్నరాధ బాధతో తలవాల్చి, 'నన్ను చూచినప్పటినుండి నాన్న యీలోకంలో లేడు. పొలం పనులు కౌలుకుయిచ్చి, ప్రాణంలేని జీవచ్ఛవంలాగ గదిలోనేవుంటూ, నాకు జరిగిన అన్యాయంగురించి బాధగా కుమిలిపోసాగాడు. నన్ను చిన్ననాటినుండి పెంచిన రామదాసు తాతమాత్రం నాన్నగురించి, అప్పుడప్పుడూ వుత్తరం వ్రాసేవారు. రామదాసు అంటే నాన్నకు, నాకు గౌరవం, అభిమానం ఎక్కువ. రామదాసు వయసులో పెద్దవాడే అయిన, నా భవిష్యత్తుగురించి, రవిబావతో నా పెండ్లి గురించి రెండు మూడుపర్యాయాలు నాన్నగారితో తగవులాడాను. రామదాసును నేను ఎప్పుడూ 'తాత' అని పిలిచే దాన్ని.

నాగురించి నాన్నగారు అలా ఏడుస్తూవుంటే, తాత ఎన్నోవిధాలుగా నాన్నగారికి నచ్చచెప్పేవారు. కాని నాన్నకు పెంచిన మమకారం. అందరిమాటలు వినకుండా, తుదకు రవిబావను, తన చెల్లెల్ని కాదని యీపెండ్లి చేసినందుకు, యీలోకం తనకు తగినశాస్తి, గుణపాఠం నేర్పిందని

తాతతో చెప్పేవారట! తనకు యిది చాలదు. యింకా.... యింకా....తనకు కావాలనిచెప్పి ఏడ్చేవారు.

ఒకరోజు సాయంకాలం యింటిపనులు అవి చూచుకొని హాలులో కూర్చొన్నాను. ఇంతలో 'టెలిగ్రాం' అని పోస్టుమేన్ అనడంతో, వెళ్ళి టెలిగ్రామ్ కాగితం తీసుకొన్నాను.

విప్పిచూడగా 'ఫాదర్ సీరియస్ స్టార్ట్ యిమీడియట్' అని వుంది. ఆమాటలు చదివిన నాకు నా కాళ్ళు భూమిమీద నిలబడటంలేదు. నాశరీరం కుప్పగా క్రింద పడేవిధంగా వుండసాగింది. ఏలాగో ధైర్యంగా తూలుతూ సోఫాలో కూర్చొన్నాను.

రెండుమూడునిముషాలు నాన్నయే నాకండ్లముందర మెదలసాగారు. శక్తినంతా కూడకట్టుకొని గోపాల్‌గారి ఆఫీసుకు ఫోన్ చేశాను.

ఆఫీసుగుమాస్తా 'అయ్యగారు లేరమ్మ, వారు దినంలో ఎప్పుడో ఒకపర్యాయం ఆఫీసుకు వచ్చేవారు. ఒకొక్క రోజు ఆఫీసుకు రాకుండాకూడ వుంటారు' అని చెప్పాడు.

ఆమాటలువిన్న రాధాదేవి రిసీవరును టెలిఫోన్‌మీద వుంచి 'సోఫాలో కూర్చొని ఎక్కడికి వెళ్ళివుంటారు' అని మనసులోనే ప్రశ్నలవర్షం కురిపించింది.

కాసేపు సోఫాలో కూర్చొంటుంది. మరి కొంతసేపు పిల్లిలాగా అటూ యిటూ హాలులో తిరుగుతూ మనసులోనే మాట్లాడుకోసాగింది. టైం చూచుకొన్నది. రాత్రి 6.00 గంటలు కావస్తుంది.

భగవంతుడా! నాకు నాతండ్రియే సర్వస్వం. చిన్ననాడే అమ్మను తీసుకొన్నావు. ప్రాణంగా ప్రేమించిన రవిబావను నానుండి దూరంచేశావు. యిప్పుడు నాన్నగారిని దూరం చేయకు. నాకోసం, నా బాగుకోసం యీ పెండ్లి చేశారే కాని, మనసులో ద్వేషం వుంచుకొని నాపెండ్లి చేయలేదు. నీకు కావాలంటే నన్ను నీలో చేర్చుకో కాని, నాన్నగారిని మాత్రం తీసుకపోవద్దు, అని పరిపరివిధాలుగా వాపోతూ తిరుగసాగింది.

రాత్రి 9.30 గంటలు కావస్తుంది. ఇంతలో పోర్టికోలో కారు ఆగడంతో, తొందరగా అడుగులువేస్తూ వస్తున్న గోపాల్‌కు ఎదురువెళ్ళి ఏడుస్తూ 'ఏమండి నాన్నగారికి ఆరోగ్యం బాగులేదని, రామదాసుతాత టెలిగ్రాం యిచ్చాడు. మీకోసం కాచుకొనివున్నానండి మీతో చెప్పిపోతామని. మిమ్మల్ని పిల్చుకపోదామని. రండి త్వరగా' అని చెయ్యి పట్టి లాగింది రాధాదేవి.

గోపాల్ ఆరోజుకూడ ఎప్పటిలాగ బాగుగా త్రాగి తూలుతూ, ప్రక్కన ఒకపిల్లతోవుంటూ, ఆమె భుజంమీద చెయ్యివేసుకొని 'హేయ్యి నా చెయ్యోదులు. నీ నాన్నకోసం నాసంతోషాన్ని పాడుచేసుకోవాలా? నెవర్' అన్నాడు.

'అయితే నేను వెళ్ళడానికైనా అనుమతివ్వండి' అని ప్రార్థిస్తు అడిగింది రాధాదేవి.

గోపాల్ ఆ వన్నెలాడితో మేడమెట్లుఎక్కి వెళుతూ 'నీవు ఎక్కడికైనావెళ్ళు : మేడమీద నాకు బాటిల్సు, చిప్సు తీసుకయిచ్చి వెళ్ళు' అని అన్నాడు.

రాధాదేవి కన్నీరు కారుస్తూ గబగబ బ్రాందీసీసాలు మేడమీదవుంచి, 'నేను వెళతానండి' అనగా, గోపాల్ 'ఐస్‌గడ్డలు తేలేదేం?' అన్నాడు.

రాధాదేవి గంగబ క్రిందకుదిగి ఫ్రిజ్ తెరచి అందున్న ఐసుబిళ్ళలు, గాజుజాడీలోవేసుకొని మేడమెట్లు ఎక్కి వారి ముందు వుంచి 'వస్తానండి' అని బయటకు సాగింది.

అంతలో గోపాల్ 'హేయ్యి! నాగర్ల్‌ఫ్రెండు భోజనం చేయలేదట, నాలుగు ఎగ్ ఆమ్లేట్లు చేసియిచ్చి వెళ్ళు' అన్నాడు.

రాధాదేవి ఏడుస్తూ 'చూడండి గంట 9.30 కావస్తుంది. రాత్రి 10.00 గంటలకు ట్రైను. యిాబండి దొరక్కుండా పోతే నాకు జన్మ యిచ్చినతండ్రిని చూడలేను. దయచేసి యీవిషయంలో నన్ను మన్నించండి. అనగా గోపాల్ కోపంతో రాధాదేవి చెంపమీద 'ఛెళ్' అని కొట్టి 'డామిట్! నాకే ఎదురుచెప్తావా?' అన్నాడు.

రాధాదేవి కన్నీరుతుడుకొని 'మీకు సిగ్గుగా లేదాండి? పరాయిదానికి, అందులోనూ డబ్బుయిస్తే శరీరాన్నే అమ్ముకొనేదానికి, భార్యను పనిచేయమనటానికి. నేను మీకు ఏనాడూ అడ్డు చెప్పింది లేదు. నా ప్రాణప్రదమైన నాన్న ఆపదలో వున్నారని వెళ్ళాలంటే, ఆపుతారా? అనగా—

'నీవు నేను చెప్పినట్లు చేయడానికి వుంచుకొన్నాను. కాని, నీ యిష్టంవచ్చినట్లు వెళ్ళడానికికాదు. అలా నా మాటను కాదని వెళ్ళావంటే యిక యీ యింటిలో నీకు స్థానం లేదు' అన్నాడు గోపాల్.

ఆమాటలకు 'మంచిదండి. మీరు తప్పత్రాగి ఎందరి వుంపుడుకత్తెలతోనైనా వుండండి' అని పెట్టెతీసుకొని కాంపౌండుదాటి రోడ్డునరాగా ఎదురుగా వస్తున్న టాక్సీని ఆపి 'రైల్వేస్టేషనుకు పోనియ్యి' అన్నది రాధాదేవి.

(ఇంకావుంది.)